# 'యాక్ట్'లో రూ.1,200 కోట్ల పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల్లో 10 లక్షల మందికి పైగా వినియోగదార్లకు బ్రాడ్‌బ్యాండ్, కేబుల్ టీవీ సేవలు అందించే సంస్థ యాక్ట్ (ఆత్రియా కన్వర్జెన్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్) లో రెండు ప్రముఖ సంస్థలు 200 మిలియన్ డాలర్ల మొత్తాన్ని (దాదాపు రూ.1,200 కోట్లు) పెట్టుబడిగా పెట్టనున్నాయి. ఇందులో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడుల సంస్థ అయిన టీపీ అసోసియేట్స్ ఒకటి కాగా, రెండోది మారిషస్‌కు చెందిన యార్గాన్. ఈ మేరకు పరస్పర పెట్టుబడి ఒప్పందం కుదుర్చుకున్నట్లు యాక్ట్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇందుకోసం యాక్ట్‌లో ప్రస్తుతం వాటాదార్లుగా ఉన్న సంస్థలు తమ వాటాల్లో కొంత భాగం విక్రయిస్తున్నాయి. యాక్ట్‌లో ఇండియా వాల్యూ ఫండ్- 3 కే మెజార్టీ వాటా ఉంది. ఇండియా వాల్యూ ఫండ్- 3 ని మనదేశానికి చెందిన పీఈ సంస్థ ఇండియా వాల్యూ ఫండ్ అడ్వైజర్స్ (ఐవీఎఫ్‌ఏ) నిర్వహిస్తోంది. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని హైదరాబాద్, నల్గొండ, నెల్లూరు, బాపట్ల, విజయవాడ, ఏలూరు, సామర్లకోట, వైజాగ్ తదితర పట్టణాలు/ నగరాల్లో ఆప్టికల్ ఫైబర్ టెక్నాలజీతో, అధిక వేగం కనెక్టివిటీ సేవలు అందిస్తోంది.

వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు డిమాండ్ మరింత లభిస్తుందని విశ్వసిస్తున్నట్లు టీపీ అసోసియేట్స్ ఇండియా సహ- అధిపతి ధీరజ్ పోద్దార్ ఈ సందర్భంగా అన్నారు. ప్రస్తుత పెట్టుబడి ఫలితంగా ఆయన యాక్ట్ డైరెక్టర్ల బోర్డులో చేరనున్నారు. టీపీ అసోసియేట్స్‌తో వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామ్యాన్ని తాము స్వాగతిస్తున్నట్లు యాక్ట్ సీఈఓ బాలా మల్లాది వివరించారు. ఆధారపడదగిన- వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్‌ను వినియోగదార్లు కోరుకుంటున్నారని ఆయన విశ్లేషించారు. టీపీ అసోసియేట్స్, యార్గాన్ సహకారంతో తమ స్థానాన్ని స్థిరపరచుకొని విస్తరిస్తామని, వినియోగదార్లకు ఇంకా మెరుగైన సేవలు అందిస్తామని యాక్ట్ ఎండీ సుందర్‌రాజు వివరించారు. వచ్చే అయిదేళ్లలో హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ పెరిగి, యాక్ట్‌కు వ్యాపారావకాశాలు విస్తరిస్తాయని టీపీ అసోసియేట్స్ ఆసియా విభాగం సహ-అధిపతి నవీన్ ఏ.వధేరా అభిప్రాయపడ్డారు.



కార్యక్రమంలో పాల్గొన్న యాక్ట్ ఫైబర్ నెట్ ప్రతినిధులు